# బలి పశువు

సంగంబండ జగన్నాథరెడ్డి

తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు) ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీ (1997)లో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ.

అది ఓ పల్లె. ఆ పల్లెలో ఎల్లమ్మ దేవర ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు ఆ గ్రామీణులు. ఈ ఉత్సవాలంటే ఆ బాలగోపాలానికెంతో సంబరం. మరెంతో సరదా. మూడేళ్ళకోసారి అమ్మవారికి దున్నపోతును బలి ఇస్తారు పల్లీయులు. ఆ ఉత్సవాల సమయంలో అంతా బంధువర్గాన్ని పిలిపించుకుంటారు. ప్రతి ఇంట పండగ వాతావరణం కనబడుతోంది. పోతును బలి ఇస్తే పల్లె పాడి పంటలతో అలరారుతుందని వారి ప్రగాఢ విశ్వాసం.

అలా బలి ఇచ్చే దున్నను తరతరాలుగా ఆ గ్రామదొర, భూస్వామి యానాదిరెడ్డి కుటుంబం వారే దేవర పేర ఓ సుముహూర్తాన ఆరు మాసాల దూడను అమ్మవారి పూజారిచేత బండారు వేయించి వదుల్తారు. అప్పటి నుంచి ఆ దూడను కట్టి వేయడం జరగదు. దాని ఇష్టం వచ్చిన పొలాలలో మేస్తు బిక్క బలిసిపోతుంది. తెగ బలిసిన దేవరపోతు గ్రామంలోని దున్నలను, దుక్కిటెద్దులను వెంటపడి పొడిచినా దాన్ని గ్రామస్తులు కొట్టరు. ప్రేమతో పక్కకు తోలుతుంటారు. అలా మూడేళ్ళ క్రితం వదిలిన దున్నపోతు హైవేలోని తారురోడ్డులా నిగనిగలాడుతోంది. మూనె వేస్తే ఒడుదుడుకులు లేక దాని శరీరం నుంచి జారే విధంగా ఉంది.

ఆ దేవరపోతు బలి ఇచ్చే రోజు రానే వచ్చింది. గ్రామస్తులంతా తెల్లవారుజామున నిద్రలేచి తలంట్లు పోసుకుని పిండి వంటలు చేశారు. సూర్యోదయ సమయాన బోనాలు గ్రామ బొడ్డురాయి వద్దకు చేరాయి. అక్కడ వేప మండలు కట్టి బండారు వేసి దృఢకాయులైన యువకులు దేవరపోతును పట్టుకునుంచున్నారు. ఇక బైండ్లవారి పాటలతో బసివిన స్త్రీల నృత్యాలతో, డప్పుల మోతతో ఊరేగింపు ఎల్లమ్మగుడి చేరింది. పట్టుచొక్కా పట్టుపంచతో చేతిలో రూళ్ళకర్రతో దొర యానాదిరెడ్డి దర్పం ఉట్టిపడ, ఆన ఇచ్చిందే తడవుగా బోనాలతో స్త్రీలు అమ్మవారి కోవెల చుట్టూ ఐదుమార్లు ప్రదక్షిణ చేశారు.. అమ్మవారికి దొరవారి ఇంటి నైవేద్యం అర్పించాక ఊరి వారంతా కొబ్బరికాయలు కొట్టి అమ్మవారి మొక్కు తీర్చుకున్నారు.

అమ్మవారికి తీపి వంటకాలే ఎక్కుతాయి. దేవర ముందు ఉన్న పిశాచగణానికి మేకపోతులు, దున్నపోతులను బలి ఇస్తుండడం తమ గ్రామ సంప్రదాయం అని వారంటూ ఉంటారు. గుడి కెదురుగా పాతిన కర్రల మధ్యే దేవరపోతును నిలిపి బలవంతులైన ఐదారు మంది యువకులు తాళ్ళతో కట్ట ఇరువైపులా నుంచున్నారు. పూజారి వచ్చి పోతు నుదుట బండారు కుంకుమ వేసి వెనుతిరిగాడు. ఆనాదిగా వీరస్వామి కటుంబీకులే దేవరపోతుల నరకువారు. వీరస్వామి సానబట్టిన గండ్రగొడ్డలి భుజాన పెట్టుకుని దొర యానాదిరెడ్డి పాదాలు మొక్కి ఆజ్ఞ తీసుకుని కోర మీసం మెలిపెట్టుకుంటూ పోతు చెంతకొచ్చాడు. పోతు కొమ్ములకు తాడుకట్ట ముగ్గురు యువకులు ముందువైపు దాని మెడ వంచినట్టు పట్టుకున్నారు.

నరికేందుకు చక్కని వీలు కలగగానే వీరస్వామి గొడ్డలి పైకి లేపాడు. జనమంతా ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. గొడ్డలి ఒక్క వేటుకు పోతు అంబా అనే అరుపుతో బాటు రక్తం చిమ్మి పక్కవారి దుస్తులు ఎర్రనయ్యాయి. ఆ రక్తం అలా చిల్లిపడ్డ కుండలా ప్రవహిస్తోంటే మెడ ఎంతవరకు తెగిందో కనిపించదని పక్క నుంచి ఓ వ్యక్తి పోతు మెడపై కడవతో నీరు కుమ్మరిస్తున్నాడు. వీరస్వామి మరో రెండు గొడ్డలి దెబ్బలు వేయగానే మెడ పూర్తిగా తెగిపోతూ వేలకొరిగింది. మొండెం వేరయ్యాక పోతు కాళ్ళు గిలగిల కొట్టుకుని ప్రాణాలొదిలింది. దేవరపోతు ఆర్తనాదం అక్కడి జనం ఆనందంతో వేసే ఈలలు, కేరింతల మధ్య ఎవరి చెవి సోకలేదు. ఆ దృశ్యం పరమకిరాతకంగా, పైశాచికంగా ఉన్నా పోతును బలి ఇచ్చి దేవర మొక్కు తీర్చుకున్నామనే ఆనందంతో ఊరి జనం మనసుల్లో ఆర్ద్రతాభావం ఒకింతైనా చోటు చేసుకోలేదు. గుడి ముందు తవ్విన గోతిలో పోతు తల ఉంచి అన్నముతో చేసిన దీపం వెలిగించి పూజ చేసి తల పూడ్చి పెట్టారు. వచ్చిన జనం పోతు పడింది, పదండి అంటూ అమ్మవారికి మొక్కి ఇళ్ళబాట పట్టారు.

ఇళ్ళకు వెళ్ళేవారు వెళ్ళిపోతుంటే పోతు మొండెం, బలి ఇచ్చిన మేకలు కోసి వంటలు చేసే యత్నంలో కొందరున్నారు. మరోపక్క అరుగు ముందు గ్రామం ముందు ఉండే గూడెం రంగయ్య దంపతులు తమ ఒక్కగా నొక్క 14 ఏళ్ళ కూతురు మల్లికి కొత్త బట్టలు కట్టించి బసివినిగా కూర్చున్నారు. పెద్ద మనిషి అయిన ఆర్నెల్లకే ఏపుగా పెరిగిన మల్లికి బసివిని అంటే

అర్థం తెలియదు. పైగా గూడెం పెద్దలు బసివిని అంటే దేవత అని, దేవుడి భార్య అని చెబుతుంటే తానో దేవతనైపోయినట్టు సంతసిస్తోందా అమాయక బలిజీవి. అరవిరిసిన మల్లి– అందాల జాబిల్లి లాంటి మల్లి మెడతో కుల పెద్ద దేవత పేర తాళి కట్టారు. ఆ తతంగం వైపు యానాదిరెడ్డి ఓర చూపు చూసుకుంటూ ఇంటికెళ్ళిపోయాడు.

రంగయ్య దంపతులు తన కూతురును బసివిని చేసి పెళ్ళి చేసినంత సంబరపడిపోతున్నారు. పెళ్ళై పదేళ్ళైనా పిల్లలు పుట్టకపోవడంతో బిడ్డ పుడితే బసివిని చేస్తానని మొక్కుకున్న ఆ అమాయక దంపతులు అమ్మవారి మొక్కు తీర్చుకున్నామని సంతోషపడుతున్నారు. కొత్త పెళ్ళికూతురిలా ఉన్న కూతురి చేత చిన్న తట్ట పట్టించి ఊరంతా ఇల్లిల్లూ తిరుగవెళ్ళారు. అలా భిక్షం వెళితే ఆమె బసివిని అయినట్టు ఊరందరికీ తెలుస్తోందని కులపెద్దల ఆజ్ఞ. మొదట దొర యానాదిరెడ్డి ఇంటికి వెళ్ళి రెడ్డి కడపకు బొట్టుపెట్టి పెద్దలు చెప్పినట్టు మొక్కింది మల్లి. మల్లి భిక్షపు తట్టలో దొర ఐదు వందల రూపాయలుంచాడు.

"ఒక్కగానొక్క కూతుర్ని ఇంటి దీపం కోసం దేవతకర్పించాము. మీ దయ ఉండాలా? కాల్మొక్కుతా.." అంటూ రంగయ్య దొరకు దండం పెట్టి కూతురును దొర కాళ్ళు పట్టుకోమన్నట్టు సైగ చేశాడు.

దొర ఇంటి కడపకు మొక్కడం దొర కాళ్ళకు మొక్కడంలో తేడా తెలియని పసితనంతో పెద్దలు మొక్కమన్నప్పడల్లా మొక్కి కదిలింది మల్లి. దొర ఇంటి నుంచి గ్రామంలోని మిగతా ఇళ్ళకు వెళ్ళారు వారు.

రాత్రి పది గంటలైంది. ఆ ఊరంతా పండగ సంబరాల్లో తేలియాడుతోంది. కొందరు భోజనాలు చేసి చుట్టపక్కాలతో మాట్లాడుకుంటున్నారు. కొందరు దేవరపోతు మాంసం తింటూ, కల్లు త్రాగుతూ ఆనందంగా తూలుతున్నారు. అమ్మవారికి బలి ఇచ్చిన దున్న మాంసం రైతులిచ్చిన రెండు బస్తాల బియ్యం ఒకేచోట పెద్ద పెద్ద పాత్రలలో ఒండి గూడెం అంతా మాంసం ముక్కలు నంజుకుతింటున్నారు. ఎల్లమ్మ మహిమలు కథలు కథలుగా చెప్పకుంటున్నారు. పోతును బలి ఇచ్చినందుకు ఈ యేడు వర్షాలు బాగా కురిసి పిడికెడు గింజలు విత్తితే పుట్టెడు పండుతాయని వారు విశ్వసిస్తూ సంతోషిస్తున్నారు. సంబరపడిపోతున్నారు.

గ్రామం వెలుపల గూడేనికి ఆనుకుని ఉన్న పొలంలో కట్టించుకున్న గెస్ట్‌హౌస్‌లో పట్టుబట్టలేసుకుని పైన అత్తరు పూసుకుని కొత్త పెళ్ళికొడుకులా ముస్తాబై సోఫాలో కూర్చున్నాడు యానాదిరెడ్డి. ఆ గూడేనికి ఇళ్ళ కోసం ఆయనే కొంత భూమి ఇచ్చాడు. ఇళ్ళకు చోటిచ్చినందుకు దొరను వారు ధర్మప్రభువు అంటుంటారు. దేవుడిలా చూస్తుంటారు. పేదలకిచ్చిన భూమికి గవర్నమెంటుతో మంచిరేటు రాబట్టుకున్న విషయం ఆ గూడెపు అమాయకులకు తెలియదు పాపం.

"ఏరా ఎల్లిగా పిల్లేదిరా" సిగరెట్ దమ్ము లాగుతూ అడిగాడు దొర.

"వారే వెంబడించుకొని వస్తామన్నారు దొరా!" చేతులు కట్టుకుని చెప్పాడు జీతం ఉన్న మల్లయ్య.

"మళ్ళీ ఎల్లొస్తావా" అసహనంగా కదుల్తూ అన్నాడు యానాదిరెడ్డి.

"ఆ.. వస్తున్నారు దొర" గెస్ట్ హౌజ్ వైపు వస్తున్న వారిని చూసి అన్నాడు మల్లయ్య.

రెడ్డి ఆనందానికి అవధుల్లేవు. అతడికిది కొత్తగాకున్నా కన్నెరికాలు చేయడమంటే అతడికి యమ ఇది. తన మగతనానికి విరిసీ విరియని లేత మొగ్గల్లాంటి అమ్మాయిలు ఒడ్డునపడ్డ చేపల్లా గిలగిలలాడితే చెప్పలేని, పట్టరాని ఆనందంతో జుట్టు పీక్కుంటాడు. రంగయ్య ఆ ఉదయం అమ్మవారికి బసివినిగా వదిలిన లేత మొగ్గ మల్లిని వెంట తీసుకొచ్చాడు.

"ఆ రాత్రికిక్కడే దొర వద్ద ఉండమ్మా" అంటూ వెనుదిరిగాడు రంగయ్య.

మల్లికి కుల ఆచారం ప్రకారం కల్లు త్రాగించారేమో "నేనొత్తానయ్యా", అంది తండ్రితో ఒత్తిపలుకుతూ.

"నువ్వేం భయపడవద్దు తల్లీ. దొర దేవుడంటోడు. నేను పొద్దున్నే వస్తాగా" అంటూ వడివడిగా వెళ్ళిపోయాడు.

రంగయ్య వెళ్ళిపోగానే 'ఇంట్లోకి పోదాం పదవే మల్లి' అంటూ ప్రేమగా రెక్క పుచ్చుకుని మల్లెలు పరచిన మంచం వద్దకు తీసుకెళ్ళాడు దొర. బలి ఇవ్వ పట్టుకెళ్ళే బలి పశువుకు బలి విషయం తెలియనట్టే యానాదిరెడ్డిని అనుసరించింది కల్లాకపటమెరుగని మల్లి. పాలేరు యల్లయ్య తలుపులు మూసి బయటకెళ్ళి దూరంగా గొంగడేసుకు పరుండిపోయాడు కాపలాగా.

"నేనెల్లిపోతా తలుపులు తెరిపించండి దొరా!"

"మల్లి నిజంగా నీవు మల్లెమొగ్గవే, అంతేగాక నువ్వు దేవర మనిషివి. ఈ రాత్రంతా పూజలు చేయాలి రా!" అంటూ గట్టిగా కౌగలించుకున్నాడు. ఆ మొరటుతనానికి ఆమె లేత పక్కటెముకలు విరిగినట్టయ్యి బాధగా మూల్గింది మల్లి. ఇంటి వద్ద తాగిన కల్లు మత్తు కూడా దిగిపోయిందామెకు. చేతులెత్తి మొక్కుతూ వదలమని వేడుకొంది.

"నిన్నొదుల్తానా పిచ్చిదానా. ఇప్పుడు నువ్వు బసివినివి. ఊరుమ్మడి సొత్తువు. నీ కన్నెచెర విడిపించి కడుపు పండేదాకా ఈ బంగ్లాలోనే ఉంచుకుంటా" అంటూ మంచంపై వేసి ఆక్రమించుకున్నాడు. ఈ హఠాత్పరిణామానికి నివ్వెరపోయింది మల్లి. ఆ రాక్షస రతిలో దొర పరుపుపై పరచిన మల్లెలా నలిగిపోయింది మల్లి.

గ్రామ దేవతకు పోతునెంత అల్లారు ముద్దగా చూసినా అది మాంసం ముక్కలై అందరి పంటికింద నలుగుతోంది. దేవరపోతును తరతరాలుగా గ్రామంలో ఒకే వంశం వారే గండ్రగొడ్డలితో నరుకుతారు. ఆ తర్వాత అది వంటకమై ఊరందరికీ ఆహారమౌతోంది.

దేవరకు బసివిని చేసిన బాలలను గ్రామదొర కన్నెచెర విడిపిస్తాడు. ముచ్చట పడితే మూడు రాత్రులు అనుభవిస్తాడు. ఆ పాప మరీ రూపవతి అయితే ఓ బిడ్డతల్లి అయ్యేదాక ఉంచుకుంటాడు. ఆ తర్వాత ఊర బసవియై ఊరుమ్మడి సొత్తైపోతుంది. కోరినవారికి కొంగుపరచి పడక సుఖాలు చవిచూయిస్తోంది. మనసులేని మరబొమ్మైపోతుంది. సుఖం ఇచ్చే బసివినీ బాలలకు సుఖరోగం అంటిస్తారు కాముకులు. దేవరపోతును ముదమారగా పొలాలలో మేయనిచ్చి కర్కశంగా బలి ఇస్తారు. బలిపశువుల బతుకుల్లాగే బసివినీ బాలల బతుకులు బలిచేసి ఆఖరుకు ఛీ..ఛీ.. వ్యభిచారి అంటూ వెలివేసి అవందిస్తారు క్రూర మనస్తత్వాన్ని పెంపొందించుకున్న జనం. ఎన్ని చట్టాలున్నా.. ఎందరు సంస్కర్తలున్నా.. ఎన్ని మహిళా సంఘాలున్నా.. ఈ ఆంధ్రావనిలో ఇంకా అక్కడక్కడా మల్లిలా వాడిపోయే పసి మొగ్గలెన్నో.. బలిజీవులెన్నో.. ఎన్నెన్నో..



"These bank fees are getting out of hand."